
# అమ్మమ్మ - కారునోము

ఎ. తేజోవతి



"అమ్మలూ.. అమ్మలూ" అంటూ వచ్చింది మా అమ్మమ్మ. వస్తూనే జర్నీ బాగ్ అక్కడ పడేసి "అమ్మలూ, కాఫీ పట్టుకురా" అని ఆర్డరు పారేసింది కుర్చీలో జారబడుతూ.

మా అమ్మమ్మంటే మాకు చాలా ఇష్టం. ఆమె వచ్చిందంటే మాకు ఆనందం. అందుకని కాఫీతోపాటు టిఫిను కూడా ప్లేటులో పెట్టుకొచ్చి ఇచ్చాను సంతోషంగా.

కుశలప్రశ్నలయ్యాక టిఫిను తింటూ, "అమ్మలూ, మనం ఒక నోము నోచాలే" అన్నది.

"ఏం నోము? సత్యనారాయణవ్రతమా?"

"కాదు."

"శ్రావణమంగళవారం నోమా?"

"శ్రావణం వెళ్లి చాలా రోజులైంది కదే అమ్మలూ!" మందలింపుగా అన్నది అమ్మమ్మ.

మా అమ్మమ్మ ఒక తమాషా మనిషి. చదువుకుంది. ఉద్యోగం కూడాచేసింది. అయినా చాదస్తం పోదు. ఆ చాదస్తంలో కూడా ఒక వింతను సృష్టించగల నేర్పు మా అమ్మమ్మకుంది. తెల్లజుట్టూ (బతిమాలినా జుట్టుకు రంగెయ్యదు) ఆ తెల్లజుట్టుతో చుట్టచుట్టి దానికి నల్లటి నెట్ వేస్తుంది. అదేమంటే పిన్నులు పడిపోకుండా ఈ నెట్టూ అంటుంది. ఆ పైన గుంటూరు జరీచీరలో నిండుగా ఉండే అమ్మమ్మంటే మాకు చాలా ఇష్టం. అమ్మమ్మ మా ఇంట్లో ఉండాలని

మేము, నాయనమ్మ మా ఇంట్లో వుండాలని మా మామ పిల్లలూ పోట్లాడుకోవడం పరిపాటి.

అమ్మమ్మ నోము అనగానే నా మనస్సులో మా అమ్మ పట్టిన నోములన్నీ మెదిలినయి. అయితే అవన్నీ పెళ్లయిన వాళ్లు పట్టే నోములు. మరయితే ఏం నోము అయ్యుంటుందీ? అక్కడే అవిడతో పేచీ. ఊరించి ఊరించి కానీ బయటపెట్టదు. అందుకే అన్నాను. "ఏం నోమో చెప్పుమరి?" నా బుంగమూతి చూసి నవ్వుతూ "కారు నోము" అన్నది.

బాంబుపేలినట్టు ఉలిక్కిపడ్డాను.

"అదేం నోము అమ్మమ్మా! నేను పూతాంబూలం, పండుతాంబూలం, పదహారుఫలాల నోము వగైరా విన్నాను. ఈ కారు నోము మాట విన్లేదు."

"మరదే కదా తమాషా! శ్రావణ మంగళవారం నోము కథ ఎప్పుడన్నా విన్నావా?"

"ఆ.. మా బొంబాయి పిన్ని నోము నోచేప్పుడు విన్నాలే."

"అయితే ఆ కథ చెప్పు చూద్దాం."

"ఏముందీ-ఒక ఊళ్లో ఒక అల్పాయుష్కుడైన రాజకుమారుడు ఉంటాడు. అతడు మేనమామతో కలసి కాశీ వెళుతుంటే, ఒక తోటలో ఒక రాజకుమార్తె, ఆమె చెలికత్తెలు తిట్టుకుంటుంటే తను మంగళవారం నోము నోచింది కనుక వైధవ్యం లేదని చెబుతుంది. అప్పుడా రాజు కుమార్తెను తన మేనల్లుడి కిచ్చి పెళ్లి చేస్తాడు . అదేగా కథ?"

"కథ బాగానే గుర్తుంది! అయితే ఆ రాత్రి ఏం జరిగిందో చెప్పు."

"అదేలే అమ్మమ్మా. గౌరీదేవి కలలో కనపడి పెళ్లికూతురికి నీ భర్తకు గండం ఉంది. పాము వస్తుంది పాలు పెట్టు. వాసెనకట్టు అని చెబ్తుంది. అది సరేగానీ నీ కారు నోముకూ, ఆ కథకూ సంబంధం ఏమిటి?" అని అడిగాను.


"అదేనే వెర్రినాగన్నా! నీ కింకా బోధ పడలేదా? ఆ రోజుల్లో అడవులు, పుట్టలు, చెట్లూ- చేమలు. అందుకే పాములు, పులులు వచ్చి ప్రాణం తీసేవి. పరీక్షిత్తు దగ్గర నుండి చాలామంది పాముకాటుతో చనిపోయారు. మరి ఈ రోజుల్లో తారురోడ్లూ, ట్రాఫిక్ జామ్‌లూ కార్లూ, లారీలు..."

ఆవిడ మాట పూర్తికాకుండానే నేను, "అమ్మమ్మా! ఎక్కడి నుండి ఎక్కడికి లాగావ్? తెలిసిపోయింది. ఆ రోజుల్లో పాములు కాటేసి చచ్చిపోయేవాళ్లు కనుక మంగళవారం నోము, ఈ రోజుల్లో కారు ఆక్సిడెంటయి చచ్చిపోతున్నారని కారు నోము కదూ?"

"అమ్మయ్య ట్యూబు లైటు వెలిగిందీ? బతికిపొయ్యాను. ఆ రోజులకు మంగళగౌరీ వ్రతం, నాగులచవితి వగైరా సరిపోయేవి. మరి ఈ రోజులకు కారు నోము అవసరమంటాను నేను."

"కానీ అమ్మమ్మా. పాములైతే ప్రాణం ఉండి పాలు తాగి వెళ్లిపో అంటే వెళ్లిపోతాయి. మరి కారుకు ప్రాణం లేదు కదా?" నా సందేహం.

"ఓసి పిచ్చిమొద్దూ, ప్రాణం ఉంటే మాత్రం పాము మన మాటలు వింటుందా ఏం? గౌరీదేవి శివుడి అర్ధాంగి. పరమ శివుడు పాముల్ని ధరిస్తాడు. శివుడి అర్ధాంగి కనుక గౌరీదేవికి



పాముల్తో కాస్తో కూస్తో సావాసం ఉంటుంది. అందుకని అప్పట్లో అమ్మవారిని మంచిచేసుకుని పాముల్ని దూరంగా ఉంచేవారు."

"అయితే అమ్మమ్మా, ఇదికూడా ఒక రకం మంగళగౌరి నోములాంటిదే కదా. అక్కడయితే పాములు కాటెయ్యకుండా, ఇక్కడేమో కారు ప్రమాదం జరక్కుండా కాపాడమని" అని అంటుండగా అమ్మమ్మ, "కాదు. ఇది మంగళవారం నోము కానే కాదు. కచ్చితంగా కారు నోమే!" దృఢంగా పలికింది.

ఇహ అమ్మమ్మతో వాదించి ప్రయోజనం లేదనుకుని, "సరే అమ్మమ్మా. కారునోమే అనుకో. కానీ ఎవరు చేసేట్టు? అమ్మకు ఇంట్లో వంటా వార్పు ఉద్యోగం, బిజీ కదా. నాకేమో పెళ్లి కాలేదు కదా!"

"పెళ్లి కాకపోయినా పర్వాలేదు. నేనూ, నువ్వూ, వస్తే మీ మామ కూతురు చిన్నమ్మలు, కావాలంటే గుంటూరు నుండి బుజ్జి కూడా రావచ్చు. కథలోకూడా తల్లితో కలసి రాజు కూతురు పెళ్లికి ముందే మంగళవారం నోము నోచలేదా?"

ఇహ మాట్లాడలేదు నేను. మా ఇంట్లో కారు నోముకు కావల్సిన ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి.

ఈ విషయం మా అమ్మతో చెబితే ఆవిడ నవ్వేసి "అ, మీ అమ్మమ్మకు తోచింది చేస్తుంది కానీ ఒకళ్లు చెబితే వింటుందా ఏం?" అని ఊరుకుంది.

## ముఖస్తుతి

బెర్నార్డ్‌షా దర్శనార్థం ఒకమాటు ఒక ప్రసిద్ధ చైనీస్ సేనాని వచ్చాడు. చైనావారికి సహజమైన ధోరణిలో అతడు షా స్తోత్రపాఠాన్ని మొదలుపెట్టాడు.

అతడు షా కళ్లు, నుదురు, రంగు వగైరాల దగ్గర నుంచి వరసపెట్టి "ఆహా" అంటూ అభివర్ణిస్తున్నాడు. ఇక పలువరస దగ్గరకు వచ్చేట్టు కనిపించగానే షాయే అన్నాడు:

"అయితే, నా పళ్లను కూడా ప్రశంసించబోవడం లేదు గదా?"

"ఆహా ఎంత చక్కని పలువరస మీది?" అన్నాడుచైనా సేనాని.

"అయితే, మరింత దగ్గరగా చూస్తే మంచిదేమో!" అంటూ షా తన కట్టుడుపళ్లు తీసి, ఆ ముఖస్తుతిపరాయణుని చేతిలో పెట్టబోయాడు.

'కారు నోము'కు అమ్మమ్మే ముహూర్తం పెట్టి అందరికీ తెలియపరిస్తే మా మామ కూతురు చిన్నమ్మలు, గుంటూరు నుండి బుజ్జి కూడా వచ్చేశారు. ప్రయత్నాల్లో భాగంగా ముందుగా పూజ ఎలా మొదలెట్టాలి అంటే నేను "అమ్మమ్మా ముందుగా పసుపు గౌరమ్మను పెట్టాలి గదా?" అన్నాను.

"కాదు నాయనమ్మా. ఇది కారు నోము కనుక కారు బొమ్మకే పూజ" అన్నది చిన్నమ్మలు.

"పసుపు గౌరమ్మను పెట్టి ముందు పూజ చేయాల్సిందే!" అంది అమ్మమ్మ నవ్వుతూ-ఆఫ్‌కోర్స్ బోసినోటితో కాదనుకోండి!

"అట్లయితే మంగళవారం నోమే అవుతుందిగా!" మా క్రాస్ కజిన్ క్రాస్ ఎగ్జామ్.

"కాదురా. ఏ పూజ చేసినా ముందు గణపతి పూజ తప్పదు. అందుకే పసుపు గౌరమ్మను పెట్టి కారు నోము నిర్విఘ్నంగా సాగాలని పూజచేసి, ఆ తర్వాత చిన్నమ్మలు చెప్పినట్టు కారుకు పూజ."

"నాయనమ్మా! కారు పూజంటే మన పార్కింగ్ ఏరియాలో కూచుని కార్లకు పూజ చెయ్యాలంటే నేనసలు చెయ్యను" బుజ్జి అలక.

"అదికాదే బుజ్జీ, నాయనమ్మ ఉద్దేశం అది కాదు. కారు బొమ్మకు పూజ చెయ్యాలని. అంతే కదూ నాయనమ్మా?"

"అవునే బుజ్జీ, మీ అక్క చెప్పింది కరెక్టే. కానీ చిన్నమ్మలూ దాన్ని బొమ్మ అనకు! విగ్రహం అనాలి" అని సవరించింది అమ్మమ్మ.

"హమ్మయ్య. అయితే ఓ కారు బొమ్మ కొంటే సరిపోతుందన్నమాట. నేను కూడా బుజ్జిలాగానే హడలిచచ్చాను కారుకు పూజ చెయ్యాలి కాబోలునని!" అంటూ నా మనసులో మాటకూడా చెప్పేశాను.

"అదుగో కారు బొమ్మ కాదు. కారు విగ్రహం అనాలని చెప్పలేదా?"

"సర్లే అమ్మమ్మా పొరపాటయింది. కారు విగ్రహం. కానీ ఏ కారు విగ్రహం పెట్టాలి? మారుతీనా, అంబాసిడర్, కాదూ, టాటా సుమోనా. ఎందుకంటే ఇవే జనం ఎక్కువగా వాడేది. పైగా ఈ మధ్య వీటికే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నయ్యట!"

"అసలు ముందు లారీ బొమ్మ పెట్టాలి! లారీలేగా యమభటుల్లా రోడ్ల మీద తిరుగుతున్నాయి నాన్నమ్మా?"

"అదుగో బొమ్మ అనద్దన్నాను. విగ్రహం. సరే లారీ విగ్రహం కూడా పెట్టాలంటావు నువ్వు" అన్నది అమ్మమ్మ. ఇక ఏ విగ్రహాలు పెట్టాలనే దాని మీద చాలా చర్చ జరిగి చివరికి నా కోరిక మేరకు ఒక మారుతీకారు విగ్రహం అమ్మమ్మ పట్టుదలతో ఒక అంబాసిడరు, చిన్నమ్మలు కోరిక మేరకు ఒక టాటా సుమో, మా బుజ్జి సూచన మేరకు ఒక లారీ-వీటి బొమ్మలు-సారీ విగ్రహాలు-పెట్టి నోము నోచడానికి తలపెట్టాం.

ఆ విధంగానే అమ్మమ్మతో సహా అందరం బజారెళ్లి ఆ విగ్రహాలు కొనుక్కొచ్చాం. తర్వాత ఆ రోజు ఎవరెవర్ని పిలవాలి అనేదానికి మరో మీటింగు మా నలుగురితో. అమ్మమ్మ అందరు ముత్తయిదువల్ని పిలవాలన్నది.

"కాదు కారున్న వాళ్లనే పిలవాలి" అన్నది చిన్నమ్మలు.

"ఓసి మొద్దూ! కారు బాధితులు రెండు రకాలు. ఒకళ్లు కారులో ప్రయాణం చేస్తూ ఏ చెట్టుకో లారీకో గుద్ది ప్రమాదాల పాలయ్యేవాళ్లు. రెండోరకం తమదోవన తాము పోతుంటే ఏ కారో లారీయో గుద్దేస్తే పాపం టపాకట్టేసేవాళ్లు! అందుకని అందర్నీ పిలవాలి."

"నాయనమ్మా, ఒక్కోసారి స్కూటర్ మీద వెళ్తున్నవాళ్లకూ, మోటార్ బైకు మీద వెళ్తున్నవాళ్లకూ ప్రమాదాలు జరుగుతుంటయి కదా. అందుకని ఒక స్కూటర్ బొమ్మ కూడా పెడ్తే?"

"వద్దు, స్కూటర్ కానీ మోటార్ బైకు కానీ అవి లారీకో, కారుకో గుద్దుకుంటే తప్ప లేకపోతే ఏ కాలో చెయ్యో విరిగి, హాస్పిటలు పాలవుతారు అందుకని ఆ విగ్రహం అక్కర్లేదు" అంటూ రూలింగ్ ఇచ్చింది అమ్మమ్మ.

"మరి ఈ పూజ చేయించేదెవరు నాన్నమ్మా? నువ్వేనా?" బుజ్జి సందేహం.

"కాదు, పురోహితుణ్ని పిలిచి సలక్షణంగా చేయించాల్సిందే!"

"పూజయితే పురోహితుడు చేయిస్తాడు. కానీ కథ మనం చదువుకోవలసిందే గదా. మరి దీనికి కథ ఎట్లా?"

అమ్మమ్మ ఒక్క నిముషం ఆలోచనలో పడింది. ఆ తర్వాత "కథదేముందే అమ్మలూ.. దాని కథ నాకు తెల్సు నే చెబుతాను" అంటూ మొదలెట్టింది-"ఒకసారి కైలాసగిరిలో కల్పవృక్షం కింద ప్రమథాదిగణాలతో కూర్చుని ఉండగా పార్వతీదేవి పరమశివుని ఇలా అడిగింది.

" 'నాథా! భూలోకంలో వెనకటికి ఏ పాము కాటుతోనో పురుషులు మరణిస్తుండేవారు. ఇప్పుడు మోటారు వాహనాల ప్రమాదంలో చాలామంది మరణిస్తున్నారు. ఇలా మరణించకుండా ఏదన్నా వ్రతం కానీ, పూజ కానీ సెలవివ్వండి. భూలోకంలో, ముఖ్యంగా నోములూ, వ్రతాల మీద ఎక్కువ నమ్మకమున్న భారతదేశవాసులు ఈ ప్రమాదాల నుండి తప్పించుకునే సులభోపాయం

సెలవియ్యండి' అని పార్వతీదేవి అడగ్గానే శివుడు సంతోషంతో.

" 'దేవీ! నువ్వు మంచిప్రశ్న వేశావు. ప్రమాదాల్లో, ముఖ్యంగా మోటారు వాహనాల ప్రమాదంలో పురుషులు మరణించకుండా స్త్రీలు చేయతగ్గ నోము ఉంది. దాన్నే 'కారు నోము' అంటారు' అని శివుడు అనగానే పార్వతీదేవి. 'స్వామీ ఈ నోము గతంలో ఎవరు నోచారు? ఏ విధంగా చెయ్యాలి? ఆ వివరాలు కూడా తెలిపి అనుగ్రహించండి' అన్నది.

"దేవీ, గతంలో ఈ నోమును ఒక రాజకుమారి" అంటుండగా, "అమ్మమ్మా. మన ఇండియాలో రాజకుమార్తెలున్నప్పుడు ఈ కార్లు లేవుగా?" అని అడ్డుపుల్ల వేశాను.

"నిజమేనేవ్ మర్చిపొయ్యాను. రాజకుమార్తె కాదు ఒక ధనవంతుల అమ్మాయి అనబోయి అలా అనేశాను కానీ కథ విను.

" 'సౌభాగ్యనగరం అనే పట్టణంలో వేగవతి అనే ఒక ధనవంతుల గారాబుబిడ్డ ఉండేది. ఆ చిన్నదానికి మోటారు వాహనం మీద అతివేగంగా ప్రయాణం చెయ్యడం చాలా ఇష్టం. ఒకసారి వేగగమనుడు అనే మరో ధనవంతుల చిన్నవాడు ఆ అమ్మాయికి తారసపడ్డాడు. అతడికీ అతి వేగంగా మోటారు వాహనం నడపడం చాలా ఇష్టం కనుక ఆ విధంగా ఇద్దరూ ఒకరికొకరు దగ్గరయ్యారు.

" 'ఒకసారి ఆ చిన్నది తన నెచ్చెలులతో మోటారు వాహనం మీద విహారం వెళ్తూ తాను వేగగమనుడిని వివాహమాడదల్చినట్లు చెప్పగానే ఆమె చెలికత్తెలలో ఒకరు 'వేగవతీ, నువ్వు నా మాట విని ఆ యువకుడ్ని వివాహమాడే తలంపు వదిలేయి. ఎందుకంటే గతంలో ఒకసారి మా తండ్రిగారు నన్ను ఆ యువకుని కివ్వతలచి అతడి జాతకం చూపించారు. అప్పుడతడి జాతకంలో కారు గండం ఉందని, అతడు అల్పాయుష్కుడనీ చెప్పారు' అంటుంది."

"నాయనమ్మా! నువ్వు మళ్లీ పప్పులో కాలేశావ్. జాతకం చూసి ఎవరన్నా గండముందని చెప్పగలరేమో గానీ, కారుగండం అనీ, తుపాను గండం అని గానీ చెబ్తారేంటి?" చిన్నమ్మలు ప్రశ్న.

"నాయనమ్మ చెప్పడమేమిటి? శివుడు కదా చెబుతున్నాడు?" బుజ్జి ప్రశ్న.

"అవును, శివుడే గదా చెబుతున్నాడు. శివుడు పప్పులో కాలెయ్యడు కదా?"

"మరే పరమశివుడు తప్పెందుకు చెబ్తాడు? గతంలో మాత్రం సర్పగండం ఉందని, జలగండం ఉందని చెప్పేవారు కదా. ఇంతెందుకు, మిహిరుడు అనే జ్యోతిష్కుడు వరాహం వల్ల రాజకుమారుడు చచ్చిపోతాడని చెబ్తే గదా ఆయన్ను వరాహమిహిరుడు అన్నారు. అందుకని అందరూ నోర్మూసుకు వినండి!" అని కోప్పడింది అమ్మమ్మ.

దాంతో అందరం సైలెంట్ అయిపోతే అమ్మమ్మ కథ కొనసాగించింది. " 'అలా ఆ వేగగమనుడికి కారు గండం ఉంది అని తెల్సినందువల్లనే నన్ను అతడి కివ్వడానికి మా నాన్నగారు ఒప్పుకోలేదు' అని నెచ్చెలి చెప్పగానే వేగవతి వెంటనే ఇలా అన్నది-" 'నెచ్చెలీ, నా కలాంటి భయాలు లేవు. ఎందుకంటే నేను మా అమ్మతో కలిసి కారు నోము నోచాం. కనుక నా భర్తకు కారు వల్ల ప్రమాదం ఉండబోదు.'

" 'ఆ విధంగా ఆ వేగవతి వివాహం వేగగమనుడితో నిరాటంకంగా జరిగింది. వివాహమై వాళ్లు ప్రేమయాత్రకు బయలుదేరబోతుండగా ఆ రాత్రి ఒక యంత్రమూర్తి నల్లని వొళ్లు, తెల్లటిపళ్లు, ధగధగా మండుతున్న కళ్లు, అద్దాల లాంటి చెక్కిళ్లు ఇనుప చక్రాల్లాంటి కాళ్లతో వేగవతి కలలో వచ్చి, 'అమ్మాయీ.. మీ ప్రేమయాత్రలో నీ భర్తకు కారుగండం ఉన్నది. కానీ నువ్వు మీ అమ్మగారితో కలసి కారునోము నోచావు గనుక నీ యందు ప్రసన్నుడినై నీ భర్త ఆ గండం దాటే ఉపాయం చెబ్తాను విను. రేపొద్దున మీరు బయలుదేరబోయేముందు ఒక కారు విగ్రహాన్ని యథావిధి పూజించి దక్షిణతాంబూలాదులతో ఆ విగ్రహాన్ని ఒక సువాసినికి వాయనమివ్వు. అయితే ఆ కారు విగ్రహాన్ని ఒక ఖరీదైన వస్త్రంతో కప్పి ఇవ్వాల్సివుంటుంది. ఆ తర్వాత మీరు కారెక్కబొయ్యేటప్పుడు ఆ కారు ముందు ఒక కొబ్బరికాయ కొట్టి, రెండు పండు నిమ్మకాయల మీదుగా కారును పోనిస్తే ఆ గండం తొలగిపోతుంది' అని చెప్పి అంతర్ధానమయ్యాడు. ఆ విధంగా ఆ వేగవతి భర్తను కారుగండం నుండి తప్పించగలిగింది' అని శివుడు పార్వతికి కారునోము కథను చెప్పి ముగించాడు" అని అమ్మమ్మ చెప్పగానే కథలంటే ఇష్టపడే మా చిన్నమ్మలు, "నాయనమ్మా, ఈకథ ఇంకా పూర్తి కాలేదు. కారు గండం ఎలా సంభవించింది. ఎలా తప్పించుకోగలిగారో శివుడు వివరంగా చెప్పాలి కదా?" అన్నది.

"నిజమేనే అమ్మలూ, పార్వతీదేవి కూడా అచ్చు ఇలాంటి సంశయాన్నే వెలిబుచ్చడంతో శివుడు, 'దేవీ నీకు ఆసక్తి ఉంటే ఆ వివరాలు కూడా చెబుతాను విను. ఆ విధంగా ఆ దంపతులు ఆ రాత్రి కారులో బయలుదేరి అతివేగంగా పురవీధులు దాటుతుండగా దారి మధ్యలో ఒక పెద్ద గుంట కనిపించింది. దాన్ని తప్పించి పక్కకు తిప్పుదామనుకున్న సమయంలో వేగగమనుడికి అక్కడ ఒకపెద్ద ఇనుపగుండు లాంటిది అడ్డం ఉన్నట్లు


| | | |
|---|---|---|
| 6 | 5 | 10 |
| 11 | 7 | 3 |
| 4 | 9 | 8 |

సహాయానికి నమూనా



రూ. 5,50,000/- విలువగల
బహుమతులు
గెలవండి

| | | |
|---|---|---|
| 8 | | |
| | 9 | |
| | | 10 |

నిబంధనలు వర్తించును

మొదటి బహుమతి
మారుతి కారు ఎస్‌టిడి

ప్రత్యేక బహుమతి : హీరోహోండా మోటార్ సైకిల్ లేదా కలర్ టీవి

కన్సొలేషన్ బహుమతి: మ్యూచ్యువల్ బెనిఫిట్ చెయిన్‌లింక్ పథకం క్రింద టు-ఇన్-వన్, ట్రాన్సిస్టర్, ఫోటో గ్రాఫిక్ కలర్ కెమెరా, రిస్టువాచ్. ఇచ్చిన నమూనా ప్రకారం 9 ఖాళీ చదరాలను తయారు చేయవలెను. 5 నుంచి 13 సంఖ్యలను ఉపయోగించి నిలువుగా, అడ్డంగా మరియు ఐమూలగా కలిసినపుడు '27' రావలెను. ఒక సంఖ్యను ఒకసారి మాత్రమే ఉపయోగించవలెను. మీ ఎంట్రీలను ఎనవలప్/ఇన్‌ల్యాండ్/కాంపిటేషన్ పోస్టు కార్డుపై 10 రోజులలోగా సాధారణ పోస్టుద్వారా పంపవలెను. మొదటి 20 ఎంట్రీలకు టైటాన్ రిస్టువాచీ ఉచితంగా ఇవ్వబడును.




మీ ఎంట్రీలను పంపవలసిన చిరునామా :

ROYAL AGENCY (151)

P.O. BOX 9301, NEW-DELHI-110031

## నిత్యకల్యాణి

వేదంలా గోదావరి ప్రవహిస్తోందే చెల్లీ!
వెన్నెల వలె కృష్ణవేణి స్రవిస్తోందే తల్లీ!
విశాలాంధ్ర నలుమూలల
వైవాహికవైభోగం
జనుల కనుల వెలుగులలో
జాజులు వారెడి రాగం
గెల వేసిన అరటిచెట్లు తీసుకురానా తల్లీ?
ఎలమామిడి తోరణాలు కట్టనా చెల్లీ?
గడప మీద చిగురుజల్ల
గరిపొడిచెను శోభ
ముంగిట ముత్యాలు నవ్వి
రంగవల్లి సుప్రభ
ఏరువాక పడవలాగ ఎద ఊగిసలాడునే
జోడెద్దుల బండి వలె గుండెలురికి సాగునే
కల్యాణతిలకరేఖ వలె
కస్తూరి బొట్టు దిద్దవే!
తెలుగు వెలది బుగ్గమీద
దిష్టి చుక్క పెట్టవే!
తలంబ్రాల తనిసినటుల ధరణి తోచునే చెల్లీ!
వసంతాల తడిసినటుల సంజె మెరయునే తల్లీ!
జనావళికి సతతం
సంతోషప్రాప్తి
విశాలాంధ్ర నిండా
వైవాహికదీప్తి!
తుంగ తారా మాదిరిగా తుంగభద్ర నాదమే
సొన్నాయి మల్లే పెన్నానది గానమే!

ఆరుద్ర

**ఈ కవిత కూడా ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక తొట్టతొలి సంచికలో ప్రచురించినదే.**

అనిపించి కారు ఆపేశాడు.

" 'అతడలా ఆపకుంటే అదే సమయానికి ఎదురుగా ఒక పెద్ద లారీ ఆ గుంటవక్కకు అతివేగంగా వచ్చింది. వేగగమనుడు ఆశ్చర్యపోయి ఇక్కడ పెద్ద ఇనుప గుండు కనిపించింది కదా లారీ ఎలా వచ్చిందని, అది వెళ్లాక దిగి చూస్తే అక్కడ ఇనుపగుండు కనపడలేదు!

" 'అప్పుడు వేగవతి తన స్వప్నవృత్తాంతమూ, తన కారునోము వివరాలు భర్తకు చెప్పడంతో ఆ దంపతులు ఆకారునోము మహాత్మ్యం వల్లనే తమకా గండం తప్పిందని సంతోషించి ప్రతి ఏటా కారు నోము శ్రద్ధతో చేసేవాళ్లు. ఈ కథ నోము నోచిన వారికే కాక విన్నవారికి కూడా కారు ప్రమాదం నుండి రక్షిస్తుంది' అని పరమశివుడు పార్వతిదేవికి చెప్పాడు."

అమ్మమ్మకథ పూర్తయింది. మా చిన్నమ్మలూ, బుజ్జీ ఇంకా ఆ కథను గురించే ఆలోచిస్తున్నా నేను మాత్రం వెంటనే లేచి "అమ్మమ్మా! అయితే నేను వెళ్లి మా పురోహితుడితో మాట్లాడి వస్తాను" అని బయల్దేరుతూ అనుమానం వచ్చి, "ఈ కథ ఏ పురాణంలో ఉందని ఆయనడిగితే ఏం చెప్పను అమ్మమ్మా?" అని అడిగాను.

"యంత్రపురాణం వాహనఖండంలో ఉందని చెప్పు" అమ్మమ్మ ఠక్కున జవాబిచ్చింది.

వెళ్లినదాన్ని వెళ్లినట్టే తిరిగి వచ్చేసి "ఆయన ఈ పూజ నా వల్లకాదు. అధాంగపూజ చెయ్యాలన్నా, అష్టోత్తరం చెప్పాలన్నా ఏం చెప్పను?' అని పేచీ పెడుతున్నాడు" అని చెప్పాడు.

అమ్మమ్మ నవ్వి "అంటే ఆయనకు విస్మృతజ్ఞానం లేదన్న మాట. ఓ లోహనిర్మిత పాదాబ్జాయైనమః పాదైపూజయామి, అతి ప్రకాశజ్యోతి నయనాయైనమః నయనం పూజయామి-అని చెప్పచ్చుకదా?" అన్నది.

"మరి అష్టోత్తరం?"

"చెప్పేనా. వీళ్లేదో ఒకటీ, రెండూ చదువుతారని. నే చెబుతాను రాసుకో-ఓం లోహనిర్మితాయై నమః, ఓం శీఘ్రగమనాయై నమః, ఓం చతుఃచక్రధారిణే నమః, ఓం సౌకర్యదాయినే నమః," అంటూ మొత్తానికి అష్టోత్తరనామాలు చెప్పేసింది అమ్మమ్మ.

ఆ విధంగా మా కారు నోము ఆటంకాలన్నీ తొలగిపోయినయి. ఆ రోజుకు మా అమ్మ, అత్తలూ కూడా సెలవు పెట్టారు. నాక్కూడా ఆరోజు సెలవే కాలేజీకి. చిన్నమ్మలు స్కూలుకు సెలవు పెట్టడం పెద్ద ఇదేమీ కాదు.

మా అమ్మమ్మకు పెన్షను వస్తుంది. డబ్బుకు వెనకాడే ప్రశ్న లేదు. కనుక అన్ని ఏర్పాట్లు ఘనంగానే జరిగాయి.

"కారు నోమేమిటి?" అని అధిక్షేపించిన ఇరుగు పొరుగు ముత్తయిదువలు ఆసక్తితో వచ్చేశారు.

ఒక ఎత్తైన పీటమీద కొత్త తుండుగుడ్డలు పరిచి, దానిపై మానెడు సోలెడు బియ్యం పోసి, వాటి మీద మామిడి లాంటి ఆకులు పంచ పల్లవాలు పరిచి వాటి మీద అంబాసిడరు మారుతీ, లారీ, టాటాసుమో విగ్రహాలు పెడుతుంటే మా పక్కింటావిడ "ఇదో పాపా మా ఫియట్ కారు ఎప్పుడూ మొరాయిస్తుంది. దాని బొమ్మ కూడా పెట్టు" అని ఇచ్చింది. ఆ విగ్రహాలకు పసుపుబొట్లు పెట్టి కొత్త రవికల గుడ్డ కట్టి, పూల మాలలు చుట్టాం. అంతా సిద్ధంచేసి పురోహితుడి కోసం చూస్తుంటే ఎంతకీ రాలేదు.

నేను నా టీవీఎస్ మీద వెళ్లాను. ఏమైందో కనుక్కోవడానికి వెళ్లి వస్తూనే "అమ్మమ్మా కొంప మునిగింది! ఆయన మనింటికి బయలుదేరి వస్తుంటే ఆయన లూనాను కారు గుద్దేసిందట! కాలుబెణికింది. కట్టు కట్టుకుని పడుకున్నాడు. పైగా 'కారు నోము ఏమిటి? ఇలాంటి పిచ్చి పిచ్చి పూజలకు బయల్దేరాను కనుక ఇలా అయిం'దని నన్ను తిట్టి పోశాడు" అన్నాను రొప్పుతూ.

అందరూ మనసులో ఏమనుకున్నారో తెలీదు కానీ అమ్మమ్మ మాత్రం ఒక్కసారి డీలాపడిపోయి అంతలోనే తేరుకుని "అసలాయనకు తలకాయ లేదు. పద, నేను దులిపేస్తాను. కారు గుద్దితే ఎవడైనా బతికి బట్టకడ్తాడా? ఆయన 'కారు నోము' పూజకు బయల్దేరాడు కనుకే యంత్రమూర్తి క్షమించి కాలి బెణుకుతో వదిలేశాడు. అసలాయన భక్తితో బయల్దేరలేదు. అందుకే అలా జరిగింది..." అంటూ తీర్మానిస్తుంటే 'హాట్స్ ఆఫ్ అమ్మమ్మా! అనుకున్నాను నేను!

అదండీ అలా ముగిసింది మా కారు నోము కథ! ■